అనుకోండి శాంతిసామ్రాజ్యానికి మిమ్మల్ని అధిపతి చేయటానికి ఒక్క క్షణం కూడా ఆగడు. ఇప్పుడు ఈ మాటల ప్రయత్నం ఏమిటి అంటే లోపల ఉన్న ఆ జ్ఞానగంగ మీకు అందాలి. ఆ జ్ఞానగంగ మీకు అందటం లేదు. అది అందితే అప్పుడు ఆత్మసుఖం తెలుస్తుంది.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-11-2009, పాలకొల్లు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వనభోజనాలు అంటే వనంలో తులసిచెట్టు ఉండాలి, ఉసిరిచెట్టు ఉండాలి. ఉసిరి చెట్టు విష్ణువు యొక్క స్వరూపం, తులసి లక్ష్మీస్వరూపం. లక్ష్మీనారాయణులు ఉన్నచోట తినాలి అవి వనభోజనాలు అని శాస్త్రంలో చెప్పారు. మీరు కర్మమార్గంలో ప్రయాణం చేసినా, భక్తి మార్గంలో ప్రయాణం చేసినా ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానం నశించాలి. దానికి ఎంతో సాధన చెయ్యాలి. ఈశ్వరానుగ్రహం ఉండాలి, కాలం కలిసిరావాలి. లేకపోతే మనం సక్సెస్ అవ్వలేము. ఒక్క నారాయణుడు తప్పించి మనం అందరం జీవులమే, మనం స్వతంత్రులంకాదు. మనం స్వతంత్రులం అనే భావన మనకు ఉంది. అందుచేత కర్తృత్వం పెట్టుకొని బాధపడుతూ ఉంటాము. ఖురాన్‌లో చెప్పాడు మీ పెత్తనాలు ఇక్కడ చెల్లవు ఈ సృష్టి అంతా అల్లా ఇష్టప్రకారమే నడుస్తోంది. మీ ఆజ్ఞ అనుసరించి ఈ సృష్టి నడవటంలేదు. మీ దేహం ద్వారా ఏ అనుభవాలు అయితే పొందాలో ఆ అనుభవాలు పొందాక ఆ దేహం చనిపోతుంది. మాకు కష్టాలు, నష్టాలు రాకూడదు. లాభాలు, సుఖాలు రావాలి అని అందరూ కోరుకుంటారు. గుడికి వెళ్ళి భగవంతుడిని అది కావాలి, ఇది కావాలి అని అడుగుతారు కాని మోక్షం కావాలి అని ఎవరూ అడగరు. మనం భక్తులకింద చలామణీ అయిపోతున్నాము కాని మనందరం పెద్ద వ్యాపారస్తులం. మీ ఇంటి వద్ద చీపురుకట్ట లేదు అనుకోండి, ఆ టైములో మీకు నారాయణుడు కనిపిస్తే నాకు చీపురుకట్ట ఇమ్మని అడిగేస్తాము. జీవితంలో ఇలా అలవాటు పడిపోయాము. మనం అంత బుద్ధిలేని మనుషులం. భగవంతుడిని ఏది అడగాలో మనకు తెలియదు.

కష్టాలు, దుఃఖాలు ఎవరూ కోరుకోరు. కుంతి కష్టాలు కోరుకుంది, మీరాభాయి కోరుకుంది, అలా ఎవరో కొద్దిమంది ఉంటారు. ఒకోసారి భగవంతుడు కావాలనే మీకు దుఃఖాన్ని పంపిస్తాడు, అశాంతిని పంపిస్తాడు. అది జ్ఞానాన్ని ఇస్తుంది అని మీకు తెలియదు. మీకు తెలియక దుఃఖం వస్తూ ఉంటే వద్దు, వద్దు అనుకొంటారు. కష్టాలు, దుఃఖాలు ఎవరికైతే ఎక్కువగా వస్తున్నాయో వారికే తొందరగా ఆత్మజ్ఞానం కలుగుతుంది. అర్జునుడు పడ్డ దుఃఖం

వలననే పరమాత్మ ఆయనకు ఆత్మజ్ఞానం బోధించాడు. మీ మీద దేవుడికి విరోధం లేదు. మీ మనస్సులో ఉన్న వంకరలు తీసేయటానికే కష్టాలను పంపుతాడు. మనం శరీరానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాము కాని గుణానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వము. ఎందుచేతనంటే శరీరం నిజం అనుకొంటున్నాము, గుణం అబద్ధం అనుకొంటున్నాము. మీరు శరీరానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చినా అది ఏదోరోజు చనిపోతుంది. మీరు మంచి గుణాలను సంపాదిస్తే ఈ శరీరం స్మశానంలో కాలిపోయినా మీరు సంపాదించుకొన్న మంచిగుణాలు మరణానంతరం మీ కూడా వస్తాయి. హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి మంచిగుణాలు మీకు సహకరిస్తాయి. ధనంకంటే, పాండిత్యంకంటే గుణం గొప్పది. కొంతమంది ధనవంతులు ఉంటారు, పండితులు ఉంటారు, వారి గుణాలు సరిగ్గా లేకపోవటంవలన ఎప్పడూ అశాంతిలోనే ఉంటారు. అందుచేత మనం మంచి గుణాలను జాగ్రత్తగా పోషించుకోవాలి. సిగ్గువిడిచిపెడితే, అభిమానం విడిచిపెడితే అనేక భోగాలు అనుభవించవచ్చు అని రాజేంద్రప్రసాద్ చెప్పాడు. భర్తృహరి ఏమన్నాడు అంటే మగవాళ్ళు చేతులకు కడియాలు, ఆడవాళ్ళు చేతులకు గాజులు పెట్టుకొని తిరుగుతున్నారు. ఇలా బంగారం పెట్టుకొని తిరుగుతూ ఆ చేత్తోటి ఒక్క మంచి పని చెయ్యకపోతే ఆ చేతికి అందమా, చందమా అంటున్నాడు. మీ చేత్తోటి ఒక్క మంచిపని కూడా చేయకపోతే ఇంక ఆ చేతులు ఎందుకు? చెవులకు రకరకాల దుద్దులు పెట్టుకొంటున్నారు. మీ చెవులతో మంచి విషయాలు శ్రవణం చేయకపోతే ఇంక ఆ చెవులు ఎందుకు అంటున్నాడు భర్తృహరి.

పెద్దలను చూసి మీరు ఎప్పడూ పరిహాసం చేయవద్దు. ఎప్పడైనా అలా పరిహాసం చేస్తే అదంతా తిరిగి మీకే వస్తుంది. మన శరీరంలో ఉన్న వంకరలు స్మశానంలో కాలిపోతాయి కాని బుద్ధిలో ఉన్న వంకరలు పోవు. మన బుద్ధిలో చాపల్యం ఉంది. బుద్ధిలో చాపల్యం ఉన్నప్పడు శాస్త్రం చదివినా అది మనకు అర్థంకాదు. అందుచేత బుద్ధిలో ఉన్న చాపల్యం పోగొట్టుకోవాలి, బుద్ధిని పరిశుద్ధం చేసుకోవాలి. దీనికి రకరకాల మార్గాలు చెపుతున్నారు కాని నీ బుద్ధిలో ఉన్న వంకరలు పోవటానికి ఈ కలియుగంలో ఒక్క రామనామం చాలు అని నారదుడు చెప్పాడు. వాల్మీకి చెప్పే బోధ ఏమిటి అంటే మీ భావాలు మంచిగా ఉండేటట్లు చూసుకోండి. ఒక్క చెడ్డభావం వస్తే ఒకోసారి కుటుంబం అంతా కూడా నాశనం అయిపోతుంది. వ్యాపారస్థులు ఏరోజుకారోజు ఈ రోజు వ్యాపారం ఎలా ఉంది, ఎంత లాభం

వచ్చింది లేకపోతే ఎంత నష్టం వచ్చింది అని జాగ్రత్తగా చుసుకొంటారు. అలాగే మనం కూడా రోజూ పడుకునేముందు ఈ రోజు మన ప్రవర్తన ఎలా ఉంది అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. రక్షించేది రామాయణం అంటారు. కుటుంబంలో ఒకరికి చెడ్డ తలంపు వస్తే ఒకోసారి ఆ కుటుంబం అంతా నాశనం అయిపోతుంది. కైకకి వచ్చిన ద్వేషం అనే చిన్న తలంపు వలన దశరథుడు చనిపోయాడు, రాముడు అరణ్యానికి వెళ్ళిపోయాడు, కౌశల్య మంచం పట్టింది. అందుచేత మీరు తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. మీకు చెడ్డతలంపులు వస్తూ ఉంటే భగవద్గీత చదివినా ప్రయోజనం ఏమిటి? మంచితలంపులు వచ్చినవారికే ఆత్మజ్ఞానం వస్తోందో లేదో తెలియదు. ఇంక చెడ్డతలంపులు వస్తూ ఉంటే ఆత్మజ్ఞానం ఎలా వస్తుంది. నీకు రోజూ చెడ్డ తలంపులు వస్తూ ఉంటే నువ్వు ఒక్కడివే పాడవ్వవు నీ కుటుంబం అంతా కూడా పాడవుతుంది. వాల్మీకి ఏమని చెప్పాడు అంటే అది త్రాచుపాము, పైగా కోపముగా ఉంది, ఆ పాము కాటువేస్తే నీ శరీరానికి ఎటువంటి గతిపడుతుందో అలాగ మీరు ఏ విషయం గురించి అయినా బెంగ పెట్టుకుంటే మీ మనస్సుకి కూడా అదే గతి పడుతుంది అని చెప్పాడు.

గాఢనిద్రలో నాకు ఇది కావాలి, అది కావాలి అని ఎవరూ కోరుకోరు మెలకువ వచ్చాక నాకు అది కావాలి, ఇది కావాలి అని కోరుకుంటున్నావు. అది నీ తలంపు. నీ తలంపు ఎంత నిజమో నువ్వు కోరుకొనే వస్తువు కూడా అంతే నిజం అన్నారు భగవాన్. గాఢనిద్రలో ఉన్న వాడికి సంసారం ఏముంది. మెలకువగా ఉన్నవాడికే కదా సంసారం. మెలకువగా ఉన్నప్పడు మనిషి తలంపులతోటి ఉంటున్నాడు. లోకంలో నువ్వు కోరే పదార్థాలన్నీ కూడా నీ తలంపు ఎంత నిజమో ఆ పదార్థాలన్నీ కూడా అంతే నిజం. నువ్వు కర్మమార్గంలో ప్రయాణం చేసిన, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా గమ్యం ఒక్కటే. జ్ఞానయోగం కంటే కర్మయోగం మంచిది అంటున్నారు. కర్మయోగం అంటే నీ పని నువ్వు శ్రద్ధగా చేసుకుంటూ నెమ్మదిగా ముగ్గుతూ రావాలి. నీచేతిలోపని విడిచిపెట్టేస్తే నీకు సోమరితనం వస్తుంది కాని జ్ఞానం రాదు. రామకృష్ణుడు ఏమని చెప్పాడు అంటే పని మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోవాలి కాని మనం పనిని విడిచిపెట్టకూడదు. నువ్వు బలవంతాన కర్మ విడిచిపెడితే ఆ కర్మే వచ్చే జన్మలో నిన్ను వెంటాడుతుంది, ఆ పనే మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. అందుచేత భగవంతుడు నీకు ఏ పనిని అయితే కేటాయించాడో ఆ పనిని నువ్వు హృదయపూర్వకంగా చేసుకుంటూ, చేసుకుంటూ బంధంలోంచి విడుదల అవ్వాలి. నువ్వు విడిచిపెట్టవలసినది పనిని కాదు.

నువ్వు విడిచిపెట్టవలసినది ద్వేషాన్ని. నువ్వు చేసేపని ద్వేషం లేకుండా చెయ్యి, ఆసక్తి లేకుండా చెయ్యి, స్వార్థం లేకుండా చెయ్యి. అప్పుడు నీ మనస్సు పవిత్రం అవుతూ ఉంటుంది. నీ ప్రారబ్దాన్ని బట్టి ఒకోసారి అదృష్టం వస్తుంది అప్పడు పొంగిపోయి, ఒకోసారి దురదృష్టం వస్తుంది అప్పడు కుంగిపోతూ ఉంటే నువ్వు జ్ఞానానికి పనికిరావు. నువ్వు అర్హుడవుకాదు, మీకు యోగ్యత రాదు. నువ్వు అదృష్టం వచ్చినప్పడు అదృష్టంతోటి కలిసిపోయి, దురదృష్టం వచ్చినప్పడు దురదృష్టంతోటి కలిసిపోతే నీ బుద్ధిలో ఉన్న వంకరలు తగ్గవు, నీ బుద్ధి శుద్ధి అవ్వదు. మళ్ళీ కొత్త జన్మలు పెరిగిపోతాయి.

నీకు ఈశ్వరుడి పట్ల విశ్వాసము లేదు, అధ్యయనము లేదు, భూతయజ్ఞము లేదు (భూతయజ్ఞము అంటే నలుగురికి ఉపకారం చేయటం) బ్రహ్మయజ్ఞము లేదు (బ్రహ్మయజ్ఞము అంటే గీత అది బాగా అధ్యయనము చేయటం). మనకు ఏదీ లేదు. ఇంక సోమరితనానికి అలవాటు పడ్డాము. లోపల దురాశ పెట్టుకొని, లోపల కామం పెట్టుకొని కళ్ళు మూసుకుని కూర్చుంటే నీకు జ్ఞానం వచ్చేస్తుందా? నువ్వు డంభాచారిగా ఉండకు. జీవితంలో వాస్తవ పరిస్థితులను ఎదుర్కో, నువ్వు ఎక్కడికి పారిపోకు. నువ్వు గృహస్థాశ్రమంలో ఉన్నా, నువ్వు తెల్లబట్టలు వేసుకున్నా కాంక్ష లేకుండా, ద్వేషం లేకుండా పనిచేస్తే నువ్వు కూడా సన్యాసితోటి సమానమే. మీరు ఆసక్తి లేకుండా పనిచేస్తే మీకు ఫలితం అనుకూలంగా వచ్చినా అది మిమ్మల్ని బంధించదు. మనం కోరి తెచ్చుకున్నది బంధిస్తుంది.

ఈ ప్రపంచంలో ఏ దేశం వెళ్ళి చూచినా, ఎవరింటికి వెళ్ళి చూచినా రాగద్వేషాలు తప్పించి ఈ సృష్టిలో ఏముంది? బట్టలనిండా పెంట వాసన, మనస్సునిండా కామవాసన ఇదే ప్రపంచం అంటే అన్నాడు గౌతమబుద్ధుడు. నువ్వు రాగద్వేషాలు లేకుండా నీ డ్యూటీ నువ్వు చెయ్యి. నువ్వు ఎవరి మీదైనా అయిష్టంగా ఉన్నంతమాత్రం చేత వాళ్ళు పాడైపోరు. నువ్వు వారిమీద ఇష్టంగా ఉన్నంత మాత్రంచేత వారు బాగుపడిపోరు. వారి దేహప్రారబ్దం ఎలా ఉంటే అలా జరుగుతూ ఉంటుంది. నిర్దేశించటానికి మనం ఎవరము. మనం ఒకరిని పాడుచేయలేము, ఒకరిని బాగు చేయలేము. నువ్వు కర్తృత్వం ఎక్కడా పెట్టుకోవద్దు. ఈ పని నావల్ల అయ్యింది, ఆ పని నావల్ల అయ్యింది అని మీరు లోపల అనుకోకండి. నీకు ఆ బుద్ధి కలిగించినవాడు పరమేశ్వరుడు. నీ తెలివితేటలు కాదు. ఈశ్వరసంకల్పాన్ని బట్టి మీ శరీరాన్ని, మీ మనస్సుని, మీ బుద్ధిని ఉపయోగించుకుని మీ ద్వారా పనిచేసేవాడు

భగవంతుడు. అందుచేత మనం ఎక్కడా కర్తృత్వం పెట్టుకోకూడదు. అహంకారం పిసరంత ఉన్నా పునర్జన్మ వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు.

యోగం అంటే నిగ్రహం. పూజలు, జపాలు, ధ్యానాలు పూర్వం పెద్దలు ఎందుకు పెట్టారు అంటే మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం కోసం పెట్టారు. మీ మనస్సు మీకు స్వాధీనం అవ్వటం లేదు అనుకోండి సత్‌పురుషులతోటి సహవాసం చెయ్యండి. ఒక మహాత్ముడితోటి, ఒక మహర్షితోటి, ఒకయోగితోటి మీకు మానసిక అనుబంధం ఉంటే మనస్సు నెమ్మదిగా అణిగి పోతుంది. మనకి మనోనిగ్రహం ఉంటే, ఇంద్రియనిగ్రహం ఉంటే హైవేలో మన ప్రయాణం ఎలా ఉంటుందో ఆత్మజ్ఞాన సముపార్జన కోసం మనం చేసే ప్రయాణం అలా ఉంటుంది. మనకి మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం సాధ్యంకాదు, కాశీ వెళ్ళి వచ్చాము, గంగానదిలో స్నానం చేసాము అంటే ఇవిఅన్నీ మనం పవిత్రులం అవ్వటానికే. ఆ గంగ అంటే మన కాలువలో నీరు అనుకోకండి, అది తీర్థం. మనం పరమేశ్వరుడిని, నారాయణుడిని ప్రార్థిస్తున్నాము. మీరు వచ్చి ప్రార్థించండి అని వారు మనలను అడగటంలేదు. మనం బాగుపడటంకోసం, మన చైతన్యస్థాయిని పెంచుకోవటంకోసం మనం దేవతలను, మహాత్ములను ప్రార్థిస్తున్నాము. మనం ప్రార్థించకపోతే వారికి వచ్చే నష్టం ఏమీ లేదు. మనం సూర్యనమస్కారములు చేస్తున్నాము. మన బుద్ధిని బాగుచేయమని, వివేకమును, విచక్షణను ప్రసాదించమని సూర్యుడిని ప్రార్థించటం. మీకు సూర్యనమస్కారములు ఇష్టంలేకపోతే మానేయండి అంతేగాని ఎగతాళిగా నవ్వకూడదు. మనకు బుద్ధిసూక్ష్మత లేదు. పట్టుకొంటాము అని చెప్పి పడగొట్టేవారు ఎక్కువ మంది ఉంటారు. బుద్ధిసూక్ష్మత ఉన్నవారు మాత్రమే అది గ్రహించగలరు.

అందరిలోనూ నేను ఉన్నాను, నాలో అందరూ ఉన్నారు అని పరమాత్మ చెప్పాడు. సూక్ష్మబుద్ధి ఉన్నవాడు దేహాన్ని చూడడు, వాడికి రూపబుద్ధి, నామబుద్ధి ఉండదు, వాడు అంతర్యామిగా ఉన్న నారాయణుడినే చూస్తాడు. సముద్రంలో కెరటాలు ఉన్నాయి, కెరటాలలో ఎవరు ఉన్నారు, కెరటాలలో సముద్రమే ఉంది. అది కెరటం కింద కనిపిస్తోంది అంతే. ఈ నామరూపములు ఊరికే కెరటాల కింద కనిపిస్తున్నాయి కాని అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడే. రూపబుద్ధిని, నామబుద్ధిని పోగొట్టుకొని చూస్తే చైతన్యం ఇక్కడే అనుభవంలోనికి వస్తుంది. మన శరీరం చనిపోనక్కరలేదు, ఈ దేహం ఉండగానే దేహబుద్ధి నశించాలి వాడికి మోక్షం వస్తుంది. గౌతముడు అహల్యను శపించాడు కాని అహల్యది తప్ప

ఏమీలేదు. ఒకోసారి మనం తప్పు చేయకపోయినా గొడవలు వస్తూ ఉంటాయి, అది ప్రారబ్దం. ఒకోసారి మనం నిజంగా మంచికోసం వెళితే చెడ్డ ఎదురవుతూ ఉంటుంది. గౌతముడు శపించాక మరల రాముడి పాదస్పర్శ వలన అహల్య స్త్రీ అయింది, ఆవిడ ఎప్పుడూ పవిత్రురాలే. మరణానుభవం ద్వారా పదవ తరగతి చదివే వెంకట్రామన్ మహర్షి అయ్యాడు, రాముడి పాదస్పర్శ వలన అహల్య మహాజ్ఞాని అయిపోయింది, అంటే ఆవిడ శాపం అంతా వరంకింద మారిపోయింది. అహల్యను శపించటం తప్పని పశ్చాత్తాపపడి తరువాత గౌతముడు అహల్యను దగ్గరకు తీసుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. గౌతముడికి మనస్సు పోలేదు, అహల్య మనస్సులేని స్థితికి ఎదిగివెళ్ళిపోయింది. అహల్య నా భార్య అని గౌతముడు అనుకొంటున్నాడు. ఆయన నా భర్త అనే ధ్యాస అహల్యకు పోయింది. అంటే మనస్సు ఉన్నవాళ్ళు మనస్సు లేనివాళ్ళని ముట్టుకోగలరా? అహల్య అగ్నిహోత్రం అయిపోయింది, ఇంక వీడు ఎలా ముట్టుకోగలడు. మనస్సు ఉన్నవాడు మనస్సులేని వాళ్ళని అర్ధం చేసుకోగలరా? మనం వారిని చూసి ఆనందించాలి కాని వారిలా మనం అవ్వటం అంత తేలికకాదు. ముందు వారిని చూసి ఆనందించాలి. ఎక్కడైనా మంచి చేస్తున్నారు అనుకోండి అది చూసి ఆనందించాలి గాని ద్వేషం పెట్టుకోకూడదు. ఎవరినో చూసి ద్వేషం పెట్టుకొంటారు అనుకోండి దాని వలన మనకు ఏమి కలిసివస్తుంది. ఏమీ కలిసిరాదు సరికదా ఉన్నది పోతుంది, ద్వేషం పెట్టుకోవటం వలన శరీరం వేడెక్కుతుంది, మనస్సు వేడెక్కుతుంది.

నీ బుద్ధితో మనస్సును జాగ్రత్తగా నిగ్రహించుకొని దానిని శుద్ధి చెయ్యాలి. మనం ఏదో చెడ్డ పని చేయాలి అనుకొంటాము. నువ్వు చేసేది చెడ్డ పని అని నీ బుద్ధి చెపుతుంది. మనస్సు ఆలోచిస్తుంది కాని నిర్ణయం బుద్ధిదే. బుద్ధి నిర్మలం అవుతోంది అనుకోండి, బుద్ధి పవిత్రం అవుతోంది అనుకోండి కృష్ణుడు అర్జునుడికి ఎలా బోధించాడో అలాగ నీ బుద్ధే మనస్సుకు భోదించి మనస్సు యొక్క చాపల్యాన్ని ఆపుచేస్తుంది, అందుచేత మన బుద్ధే మనలను బాగుచేస్తుంది, అదే మనలను పాడుచేస్తుంది. అందుచేత బుద్ధిని బాగుచేసుకోవటంకంటే మించిన పని ఈ సృష్టిలో ఏమీ లేదు. దేహము కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే మనలో అంతర్యామిగా ఉన్న చైతన్యం గొప్పది. అక్కడకు నీ కళ్ళు తెరువు అని చెపుతున్నారు. అక్కడకు నీ కళ్ళు తెరవాలంటే బుద్ధి సహకారం లేకుండా అంతదూరం నీవు వెళ్ళలేవు. నీ బుద్ధి నీకు

సహకరించాలి. ఈ దేశంలో వందకోట్లమంది జనం ఉన్నారు అనుకోండి వందకోట్లమంది నీకు విరోధులు అయినా నీ బుద్ధి నీకు సహకరిస్తూ ఉంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది. మన బుద్ధి బాగా ఉంటే ఎవరూ మనలను పాడుచేయలేరు. మన బుద్ధి సరిగా లేకపోతే ఎవరూ మనలను బాగుచేయలేరు. నీ బుద్ధి బాగుపడటానికి, నీ బుద్ధిలో ఉన్న హెచ్చుతగ్గులు తగ్గటానికి, రాగద్వేషాలు తగ్గటానికి రామనామానికి మించిన మెడిసిన్ లేదని నారదమహర్షి చెప్పాడు. భరతుడు వచ్చే లోపుగా రాముడిని అరణ్యానికి పంపేయటానికి కైక తొందరపడుతుంది. అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే అమ్మా! నువ్వు కంగారుపడనక్కర లేదు. రాముడికి ఈ సృష్టిలో దేనిమీద అపేక్ష లేదు అని చెప్పాడు.

మనం సత్కర్మ చేయటం ఎవరినో ఉద్ధరించటానికి కాదు, నీ బుద్ధిని బాగుచేసుకోవటానికి నువ్వు సత్కర్మ చేయాలి. మీరు ఎవరికైనా ఏదైనా ఉపకారం చేసారు అనుకోండి, మీ ఉపకారాన్ని వారు గుర్తించకపోయినా అది మీకు అనవసరం ఎందుచేతనంటే వారి అహంకారం గుర్తించదు, మీ బుద్ధి బాగుపడటంకోసం ఆ పని చెయ్యాలి. ఒకవేళ మీరు గుర్తింపులు కోరుకుంటే మనకు రూపబుద్ధి, నామబుద్ధి పెరిగిపోతుంది. మనం మాట్లాడే మాటల వలన, చేసే పనుల వలన, మన ఆలోచనల వలన మనకు రూపబుద్ధి, నామబుద్ధి తగ్గాలి. ఈ రూపబుద్ధి, నామబుద్ధి ఎవడికైతే శేషం లేకుండా పోయిందో అప్పుడు నది వెళ్ళి సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ ఆ జీవుడు వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవుతాడు, అది కడసారి జన్మ. అందరిలోనూ అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. ఎవడికైనా అపకారం చెయ్యాలనే బుద్ధి కలిగింది అనుకో వాడిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని నువ్వు గుర్తుపెట్టుకొంటే ఆ చెడ్డ పనులు అన్నీ ఆగిపోతాయి, ఎదుటివాడికి అపకారం చేయాలనే బుద్ధి పోతుంది. ఏది మంచి, ఏది చెడ్డ, ఎవరితో స్నేహం చేయాలి, ఎవరితో స్నేహం చేయకూడదు అని మనకు తెలియటంలేదు. ఎలా ప్రవర్తిస్తే మోక్షం వస్తుందో అది మనకు తెలియటంలేదు. ఇదంతా మన బుద్ధికి తెలియాలికదా. మన బుద్ధికి అటువంటి వివేకాన్ని ప్రసాదించు అని సూర్యనారాయణమూర్తిని ప్రార్థించటం. దేహభావన లేకుండా, వ్యక్తిభావన లేకుండా, అహంకారం లేకుండా నువ్వు ఒక పనిచేస్తే అది చేసినా చెయ్యనివాడితో సమానము ఎందుచేతనంటే ఆ పని తాలుక ఫలితంగాని, ఆ పనిలో ఏదైనా దోషం ఉన్నాగాని అవి ఏమీ నిన్ను అంటుకోవు. మీరు ఏదో మంచి పని చేయటం వలన సమాజం అంతా ఉద్ధరించబడి పోదు. సత్కర్మ ఎవరినో ఉద్ధరించటం కోసం కాదు. నీ ఆనందం కోసం, నీ శాంతి కోసం సత్కర్మ చెయ్యవయ్యా, అది భగవాన్ ఉవాచ.

# లేఖ

పూజ్యులు శ్రీ నాన్నగార్కి నమస్కారములు. గొరగనమూడిలోనూ, భీమవరంలోనూ చూచి మీ ప్రవచనాలను వినే అవకాశం నాకు మొదటిది. ఆ శ్రవణం తర్వాత అడిగిన వెంటనే మీరు ఆప్యాయంగా ఇచ్చిన మీ ప్రసంగ ప్రవచనాలను చదివి తద్వారా కొంత మననం చేసుకొన్నాను.

మీ గురించి ఇదివరలో నేను విన్నదంతా ఈ అనుభవం ద్వారా ధృవీకరించుకోవడం ఒకఎత్తు. మీ గురించి వారు చెప్పినది చాలా స్వల్పం. నేను విన్నదీ చూచినదీ అనల్పం, అనితర సాధ్యం అని అనాయాసంగా అవగాహన లభించడం మరో ఎత్తు.

మీరు చెప్పే పద్ధతిలో ఒక లయ ఉంది. శబ్దాలలో ఒక మర్మం ఉంది. ఖంఠంలో మాధుర్యం, గాంభీర్యం రెండూ అలవోకగా ఆకట్టుకుంటాయి. పైగా చెప్పదలచుకున్నది నిర్ద్వందంగా, స్ఫటికంలా, స్పష్టంగా, అనుభూతి ఆలంబనం అయిన అధికారికతో చెప్పడం మీలో సహజగుణం, స్వభావనైజం. విశ్లేషించిన విషయాలని అందరూ అర్థం చేసుకోవాలి జీవిత సరళిలో అన్వయం సాధించాలి. వీటి ద్వారా ఆ శ్రవణార్థానికి పరమార్థం చేకూర్చలన్న తపన, మీ ప్రవచనాల వెనక ఉన్న ఆ 'వేదన' వేదనా రమణీయం.

నేను చదివిన పుస్తకాలలో శ్రీరామకృష్ణుల కదామృతం. శ్రీ రమణుల సంభాషణలు నాకు చాలా ఇష్టం. శ్రీ రమణుల అంశమీలో ప్రస్ఫుటంగా, ప్రగాఢంగా ప్రతిబింబించడం "శిష్యుడి బాణీ గురువు వాణియే" అని అనిపింపచేస్తుంది. మీరు చెప్పిన వాటి వెనుక శ్రీ రమణుల పట్ల మీ ఆర్ద్రత, ప్రేమ, తాదాత్మ్యం పడుగూపేకల్లా కలిసాయి. మీ వాక్యాల వెనుక మౌలికంగా కనిపించే గుణం "జ్ఞానం" స్వస్వరూప దర్పణం. అందరికీ ఎంత చేరువో, ఆ జ్ఞానాన్ని కొంచెం మెలకువతో ప్రజ్వలనం అనాయాసంగా చేసుకోవచ్చో చెప్పాలన్న తపన, ఆ ఉద్దీపన కలిగించాలన్న ఉద్వేగం, ఇవి అందరూ అవగాహన చేసుకోవాలన్న వ్యాకులత. మీ ప్రవచనాల పిండితార్థాన్ని నా కోసం ఈ విధంగా అనుకున్నా

ఆ 'ఎరుక' కోసం<br>
ఏ ఎరువు నీ<br>
అరవు తెచ్చుకోక్కర్లే<br>
అని ఎరువులూ<br>
అమిరే ఉన్నాయి<br>
అంతరంగంలో

ఒకచోట మీరు అన్నారు "తనను తాను దర్శించడమే మోక్షం", "తానుగా జీవించుటయే మోక్షం" దర్శన జీవిత సమన్వయమే అంతరంగ అవలోకనం. అందుకే ఎంతో హృద్యంగా మనస్సుని అనాయాసంగా ఆకట్టుకునే విధంగా ఆలోచనా ప్రేరకంగా అభివ్యక్తీకరణ మీ సహజ ప్రకృతి. మీ స్వభావ నైపుణ్యం.

గుండె గొంతుకలోన కొట్లాడుతుంది. అంతరంగ అనుబంధాల పరిధిలో కూడా ఇదే స్థితి.

**ఆచార్య శివరామకృష్ణ, హైదరాబాద్**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 13 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జనవరి | 1 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం (రమణ జయంతి) |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



# జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో
# భగవాన్ శ్రీ రమణ మహర్షి
# 130వ జయంతి మహోత్సవములు

## 01-01-2010 శుక్రవారం

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00ల నుండి | **సద్గురు దర్శనం** |
| ఉ॥ గం॥ 8-00ల నుండి | **భగవాన్ పూజ శ్రీ రమణక్షేత్రంలో** |
| ఉ॥ గం॥ 10-00ల నుండి<br>మ॥ గం॥ 12-00ల వరకు | **ప్రసాద వినియోగం** |
| మ॥ గం॥ 12-00లకు | **శ్రీ నాన్నగారు ఆశ్రమమునకు రాక** |
| మ॥ గం॥ 2-00లకు | **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు** |

# ద్వేషం ఉన్నచోట - దోషం ఉంటుంది

వ్యర్థంగా ఎవరైనా మనకు చెడు చేస్తారు అనుకోండి అప్పుడు మనం నిర్వికారంగా, ఏకాంతంగా విచారించుకోవాలి. మన మనస్సు అప్పుడు రజోగుణంలో ప్రవేశిస్తే మనకు ఈశ్వర ఆజ్ఞ ప్రకారం కొరడాదెబ్బ తినటానికి సిద్ధమైనట్లే. వారి మీద పగ దీర్చుకొంటే దాన్ని నాల్గురెట్లు పెంచుకొన్నట్లే. ఆ ప్రతిక్రియ చర్య వల్ల ప్రపంచాన్ని సత్యంగానూ బ్రహ్మాన్ని మిథ్యగాను చేసినట్లే. ఇది ఈశ్వర ధర్మాన్ని తలక్రిందులు చేసినట్లే. గర్వంతో విర్రవీగితే అప్పడాల పిండిలా తయ్యారౌతాము. శరీర మనోబుద్ధులతో తాదాత్మ్యం పొందితే అన్ని పాపాలకూ మూలమౌతుంది. మన శత్రువును ఎంత పరిణామంలో భాదించటానికి ఆలోచిస్తామో అంత పరిణామంలోనూ మనం బ్రహ్మ ధ్యానంలో లీనమైతే మన శత్రువు యొక్క శత్రుత్వం రూపు మాసిపోతుంది. ప్రేమ ఐక్యతను తెలుసుకోవటమే ముక్తి. శ్రీనాన్నగారు “వ్యక్తి పరంగా జీవించకుండా, సంఘపరంగా జీవించాలి. రాగ-ద్వేషాలతో జీవించినంతకాలం తలబద్ధలుకొట్టుకొన్నా జ్ఞానంరాదు అఖండంగా జీవిస్తే అఖండంగా ఉన్న ఆత్మ లభ్యమౌతుంది” అన్నారు. ఇతరులు మనలను కష్టపెడుతూ ఉంటే వారి మూలంగానే మన దోషాలు దిద్దుకోగలము. వారే మనకు గురువులు వారి వలననే మనం పవిత్రులమౌతాము. ఆత్మదర్శనం అయ్యే వరకూ జీవితం బరువుగానే ఉంటుంది ఎవరు ఏమి మాట్లాడినా వారి వాసనను బట్టి మాట్లాడుతున్నారు అని ప్రశాంతంగా ఉండాలి. తన దుఃఖానికి ఇతరులు కారణము అంటే ఆ ద్వేషంతో అసలు బాధకన్న కోపం వల్ల తెచ్చుకొన్న బాధే ఎక్కువ కాలం మనలను వేధిస్తుంది. క్షమాగుణంతో శత్రువుని క్షమిస్తే ప్రశాంతంగా ఉండగలము. కక్ష తీర్చుకోవటంలోనే ఆనందం ఉంది అనుకొంటే మనకు మనమే శిక్ష వేసుకొన్నట్లే. మనలను ఎవరైనా తిడితే అది వారి సమస్యే మనది కాదు వారి మనస్సే పాడౌతుంది. ఆ అసంతోషి, దుఃఖితుడు ప్రకృతి వాసనలతో కుళ్ళిపోయిన రోగి వాడిపై నేను కోపం తెచ్చుకోవటం ఏమిటి? అనే అవగాహన అనుభవ పూర్వకంగా రావాలి. తోటి మనిషికి అన్యాయం చెయ్యటం దైవానికి ద్రోహం చెయ్యటమే కారణం లేకుండా ఏదీ ఉండదని సహనం వహించాలి. తిరగబడితే కర్మబంధంలో పడి కొట్టిమిట్టాడవలసి వస్తుంది. గతిని నిరోధించుకొన్నవాళ్ళమౌతాము. మహిమదో ప్రవక్త శిష్యుడు అవి ఒకరిపై తిరగబడితే “తిరగబడటం వల్ల దేవతలు నిన్ను వదిలారు అందుచేత నేను నిన్ను వదిలాను” అని మహిమద్ అన్నారు. కాబట్టి ప్రతిక్రియ వల్ల గురు సహాయానికి దూరమౌతాము. కర్తయొక్క ఆజ్ఞను కాదనకూడదు. గమ్యాన్ని మర్చిపోకూడదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**